

# శ్రావణమేఘాలు

శ్రీధర

దరిద్రుడు తల కడిగితే వడగళ్లవాన కురిసిందట. నా పనీ అలాగే ఉంది. నేనీ ఉద్యోగం దొరుకుతుందని కొండంత ఆశపెట్టుకుని ఈ కలకత్తా వచ్చాను. తీరా ఇక్కడికి వచ్చాక చూస్తే ఇంటర్వ్యూ అయినా జరిగేటట్లు లేదు.

టైం చూసుకున్నాను. ఆరు గంటలు. ఈ అందమైన సాయంత్రంపూట ఈ హౌరాబ్రిడ్జిమీద నిలబడిపోవటం నా కెంతమాత్రం ఇష్టంలేదు. ఉన్న రెండు రోజుల్లోనూ సిటీఅంతా చూడాలని ఉంది. చూడదల్చుకుంటే ఏ నగరాన్ని అయినా, ఏ వగలాడినయినా సాయంత్రంపూటే గదా చూడాలి. ఈ హుగ్లీనది దాటితే హౌరావాటి కలకత్తాలోకి అడుగుపెట్టి నట్టే. కానీ జిగ్‌జాగ్‌గా ఉన్న హౌరా బ్రిడ్జి నా పాలిటికొక పెద్ద ఇనుప పంజరంలా తయారైంది. నా కాళ్లకు మేకులు దిగబడినట్లు, నేనిక్కడ నిలబడి పోవడానికి కారణం ఏమిటంటే—

నిన్న రైల్లో ఎవరితోనో పరిచయం అయింది. వాళ్లిద్దరూ తండ్రీ కూతురు అయిఉంటారు. ముందుగా ఆయనే పలకరించాడు. నా దగ్గరున్న ఒకటి రెండు పుస్తకాలు ఆ అమ్మాయి తిరగేసింది. రైలుదిగి బయటికొస్తుండగా, ఒక అడుగు తండ్రికన్న వెనకగా నడిచి నాతో చెప్పిందేమిటంటే, నన్ను ఇప్పుడీ బ్రిడ్జిమీద తనని కల్సుకోమని,

నేను పొరపాటుగా విన్నానేమోననీ, లేక అలా భ్రమపడ్డానేమోననీ నాకింకా అనుమానంగానే ఉంది. ఒకవేళ ఆ భ్రమే నిజమవుతుందేమోనని ఆశగా గూడా ఉంది నిజంగా ఆ పుత్తడిబొమ్మ నా కోసం ఇక్కడికొస్తే అదెంత అరుదైన అనుభూతి! ఎంత ఖరీదైన అనుభవం! బట్ ఇటీజ్ సిల్లీ...ఇంకో పదినిముషాలు చూసి వెళ్లిపోవటం బెటర్...

పొద్దు క్రుంకుతున్నది. పైన ఆకాశం సర్కసు గుడారంలా ఉంది. ఆ గుడారంలో మెలికలు తిరుగుతూ పైకి

సాగుతున్నది పొగే అయినా, నిరంతరం పరుగిడుతున్న ఈ జనాన్ని చూస్తుంటే అది వీళ్ల పదఘట్టనంచేత రేగిన ధూళి దూసరం కాదుగదా అనిపిస్తోంది. అస్తమిస్తున్న సూర్యుడు పడమటి దిశన ఎర్రగా తేలిన నెత్తురుగడ్డలా ఉన్నాడు. నీరెండ సోకి ఎర్రబారిన నదిలోని నీళ్లు, ఆ నెత్తురుగడ్డ చితికినందువల్ల ఎర్రగా మారి...

"నమస్తే!"

వెనక్కి తిరిగి చూశాను. నిజమే. ఆమే! నేను నమస్కారం చెప్పాను.

"నా పేరు బృంద."

"నా పేరు మూర్తి."

కొన్ని క్షణాల విరామం తర్వాత అడిగింది, "ఎక్కడ దిగారు?"

''హోటల్ హౌరా అని... అదుగో ఆ స్టేషను వెనకవైపునే ఉంది."

మళ్లీ మౌనం. రెయిలింగును ఆనుకుని ఆమె, ఆమె కెదురుగా నేను. బ్రిడ్జినిండా రణగొణధ్వని. ట్రాంలు, బస్సులు, టాంగాలు. వాటినిండా జనం. కనుచూపు మేరవరకు ఎటుచూసినా చీమలబారుల్లా వందలకొద్దీ, వేలకొద్దీ జనం. ఏదో ఉపద్రవం ముంచుకొస్తున్నట్లు ఒకటే పరుగు.

"ఎన్నాళ్లుంటారు?" అని అడిగిందామె, చేతిగాజులవంక చూసుకుంటూ.

''రెండు, మూడు రోజులు. అందులోనూ ఒకరోజు అయిపోయింది."

''ఏదైనా ఆఫీసుపనా?'' ప్రశ్నకూ ప్రశ్నకూ మధ్య టైముతీసుకుంటూ నింపాదిగా అడుగుతున్నది. నేను ముక్తసరిగా సమాధానాలు చెబుతున్నాను.

"ఒక ఆఫీసులో పని. ఒక షిప్పింగ్ కంపెనీవారు ఏవో ఉద్యోగాలు ఉన్నాయని ప్రకటించారు. ఆ ఉద్యోగం నా కిస్తారా అని అడిగితే, చూస్తాం రా అన్నారు. సరే చూద్దామని వచ్చాను."

''బావుంది" నవ్వింది. "ఎంతిస్తారుట?"

"అన్నీ కలిపితే మొదట్లో ఒక వెయ్యిదాకా వస్తుందేమో... నెలకి..."

"బావుంది."

మోచేతిని రెయిలింగ్ మీద ఆన్చి, అరచేతిమీద మొహాన్ని ఆన్చింది. కొద్దిగా వంగి నిలబడ్డంచేత, వయ్యారం కనిపించింది. నా పక్కన నిలబడితే, భుజాలదాకా వచ్చింది. బొద్దుగా, ముద్దుగా, కంటికి ఇంపుగా, వయసుతో సొంపుగా కనబడుతున్నది. తెల్ల వాయిల్ చీరమీద పల్చని పూలు. అంత పెద్దది కాదేమోననిపించే నుదుటిమీద దోసగింజ లాంటి ఎర్రని తిలకం. లేతగులాబీ రేకుల్ని మడిచినట్లున్న పలచని పెదవులు. గడ్డంమీద చిన్న గుంట. ఉంగరాలు తిరిగిన ముంగురులు నుదురు మీద ఊగుతున్నాయి. వాటిని సవరించటానికి ఇంకొంచెం చనువు పెరగాలిగదా అనుకున్నాను.

''హైద్రాబాదులో ఎక్కడుంటున్నారు?"

"అన్నారం."

"ఏంచేస్తున్నారు?''

''ఏదో ఉద్యోగంలో ఉన్నానుగాని, దానికే అంకితం కావాలని లేదు."

"ఏం?"

"ఏమంటే నేను కోరుకున్న జీవితం నాకింకా లభించలేదు. నాకు లభించిన జీవితంతో నేను రాజీపడలేను."

"బావుంది" అని నవ్వింది. ఆ మాటా ఆ నవ్వూ ఆమెకు బాగా అలవాటులా ఉంది. ''ఎంతవరకు చదువుకున్నారు?" అని ప్రశ్నించింది.

''మీకు అడగటం చేతకాలేదు. ఎంతవరకు చదువు-కొన్నారు అని అడగాలి. ఈ రోజుల్లో చదువు కొనుక్కోవటమేగా?"

''బావుంది... పోనీ అదే చెప్పండి.."

''నేను చదువు కొనుక్కోవాల్సిన టైం వచ్చేటప్పటికి మా నాన్న రిటైరయిపోయి, ఇంక నావల్లకాదురా అబ్బీ అనేశాడు. తెలిసీ తెలియని వయసుగదా. ఇల్లు అమ్మి అయినాసరే చదివించమని రెండురోజులు హంగర్ స్ట్రయిక్ చేసినట్లు గుర్తు. నేను ఆశపడ్డ యింజనీరు చదువూ, పదవీ నాకు అబ్బలేదు. ఆ యిల్లూ నాకు దక్కలేదు. అందుకూ నేను బాధపడలేదు. కానీ లలిత..." ఎప్పటి సంగతో గుర్తుకువచ్చి ఇప్పటి సంగతే మర్చిపోయి ఏదో వాగబోయాను. ఆమె నావంక వింతగా కళ్లింతచేసుకుని చూసింది.

మళ్లీ మౌనం. బ్రిడ్జిమీద జనం. బ్రిడ్జికింద జలం... అలా ప్రవాహంలా సాగుతుండగా, కాలమూ కనిపించకుండా ప్రవహించసాగింది.

నీళ్ల మీద తేలి, ఎందుకో బెదిరి, చెదిరిపోతున్న దీపాల నీడలవంక చూస్తున్న దామె. చీకటి దట్టంగా చుట్టుముట్టేసింది. నదికి అవతలవైపున విశాలమైన వీధుల కవతల ఒకదాని భుజంమీదనుంచి మరొకటి తొంగి చూస్తున్నట్లున్న మేడలు. వాటి నిండా గదులు. వాటినిండా పగలబడి నవ్వుతున్న దీపాలు.

ఆమె కొద్దిగా ముందుకు వంగి నాతో అంది. "బా వుం దం డి ... అన్నీ మీవిషయాలే చెబుతూ వచ్చారుగాని, నా సంగతు లేమీ అడగలేదేం?''

"అవసరమనుకుంటే మీరే చెబుతారు గదా అని ఊరుకున్నాను. సరే, చెప్పండి. మీ దేవూరూ, ఇక్కడికి ఎందుకొచ్చారు, ఏమిటి కథ..."

''మాది వైజాగ్. ఇక్కడ మా అక్కా, బావా ఉన్నారు. మా నాన్నా, నేనూ వచ్చాం. నన్ను ఇక్కడ దించి, ఇవాళ మానాన్న వెళ్లిపోయినాడు."

"మీ బావగారేం చేస్తున్నారు?"మనసు

పాదరసంలాగా ఎక్కడికో ప్రాకి పోయింది. ఆయ నేమన్నా నాకు ఉద్యోగం రావటానికి ఉపయోగపడతా దేమోనని. ఏదో బ్యాంకులో బ్రాంచి మేనేజరుట. ఈమె తరుచుగా ఇక్కడికి వస్తూనే ఉంటుందట. సిటీతో చాల పరిచయం ఉందిట. వాళ్ల బంధువులు, ఈమె స్నేహితులూ చాలామంది ఇక్కడున్నారుట. మొన్ననే యమ్మెస్సీ పరీక్షలు రాసిందట. ఇవన్నీ నేను అడగ కుండానే తనే నెమ్మదిగా చెప్పింది. నేను వింటూ ఊరుకున్నాను.

"మీ రిక్కడ దేవతలా ప్రత్యక్ష మైనారు. నా కదే సంతోషంగా ఉంది" అన్నాను.

"నేను దేవతను కాను."

"లా... లా... అన్నాను లెండి. అంచేత నేను మిమ్మల్ని మూడు వరాలు కోరుతాను. వాటిని తీర్చాలి మీరు."

"నావల్ల కాదండోయ్. ముందే చెప్పేస్తున్నాను."

"నా కోరిక లేమిటో వినకుండానే, కాదనటం– విత్ డ్యు అపాలజీస్– మీ ఆడతనం పోనిచ్చుకోలేదు."

"బావుంది" మళ్ళీ అలాగే స్వచ్ఛంగా నవ్వింది. "చెప్పండి మరి."

"వినండి మరి. నెంబర్ వన్. దగ్గరలో ఉన్న సౌత్ ఇండియన్ హోటల్ ఎక్కడో చెప్పండి. పొద్దున దేన్లోకో దూరాను. బాష గూడా తెలియదు గదా. వాడేదో తెచ్చి ముందుపెట్టాడు. వాంతి వచ్చినంత పనైంది... "

"అలాగే చూపిస్తానులెండి. నెంబర్ టు..."

"ఉన్న రెండురోజుల్లోనూ ఇక్కడ చూడదగినవేవో చూపించాలి... "

"ఓకే. తర్వాత?"

"మీరేం అనుకోకపోతేను, మీకు వీలైతేను నాకీ ఉద్యోగం ఇప్పించే ప్రయత్నం ఏదైనా చెయ్యగలరా? మీకుగాని, మీ వాళ్లకు గాని పెద్దవాళ్లు ఎవరైనా తెల్సుంటారేమో నని..."

"తెల్సనుకోండి..."

"ఎవరు?" అని అడిగాను. ఆ మాట వినగానే నాకు ప్రాణం లేచివచ్చింది.

"ఇందిరాగాంధీ నాకు బాగా తెల్సు" అని కిలకిలమని నవ్వింది.

నా ఉత్సాహమంతా నీరుకారి పోయింది. "ఆవిడ నాకూ తెల్సులెండి. పేచీ ఎక్కడంటే, నే నెవరో ఆమెకు తెలియదు."

"పదండి, మీకు హోటలు చూపించి, నేను వెళ్తాను" అంది.

ఇద్దరం ట్రాం ఎక్కాం. ఆమె ఆడవాళ్ల సీట్లో కూర్చుంది. చోటులేక నేను ఆమెపక్కనే నిలబడ్డాను.

"మళ్ళీ మీ దర్శనం?"

"నేనే ఆ మాట అడుగుదా మను కుంటున్నాను... "

"రేపు ఇదే ట్రాంలో వచ్చేయండి. కాళీఘాట్ టెర్మినస్‌లో ఎనిమిదిగంటల కల్లా ఎదురుచూస్తుంటాను."

"నా కొంచెం లేటుగా తెల్లవారు తుంది. పదిగంటలనుంచి ఎదురు చూడండి..."

"బావుంది..." వెన్నెల విరిసినట్లు చల్లగా నవ్వింది.

నేను దిగవలసిన చోటు చూపించింది. ఎంతో కష్టంమీద కనుక్కున్నాను చిత్తరంజన్ ఎవెన్యూలో ఆ కమల్ నివాస్ ఎక్కడుందో.

సర్వర్లిద్దరూ తెలుగులో మాట్లాడు కోవటంతో నా పని మరీ సుళువు అయింది. అన్నీ దగ్గరుండి వడ్డించారు. ఆ సర్వర్ పేరు రెడ్డిట. చీరాలట. సవతి తల్లి పోరుపడలేక ఎనిమిదేళ్లకిందట ఇక్కడికి వచ్చేశాడుట.

"మళ్లీ వస్తారా సార్?" అని అడిగాడు రెడ్డి, నేను చెయ్యి కడుక్కుని బయటికి వస్తుంటే.

"నువ్విలాగే భోజనం పెడతానంటే, రోజూ వస్తాను రెడ్డీ."

"తప్పకుండా రండిసార్" అన్నాడు, వాళ్ళింట్లో పెళ్ళికి రమ్మని పిల్చినంత సంబరంగా.

రూంకు చేరేటప్పటికి పదిగంటలు దాటింది. పుస్తకం తెరిచినా నిద్రముంచు కొచ్చేసింది.

మర్నాడు కాళీఘాట్‌లో దిగేటప్పటికి బృంద చిరునవ్వుతో ఎదురైంది.

"యామై లేట్?"

"నాటెటాల్. నేనూ ఇప్పుడే వచ్చాను."

శ్యాంప్రసాద్ ముఖర్జీ రోడ్డు దాటి చిన్న గల్లీలోకి తీసుకెళ్ళింది. బెంగాళీ వాళ్లకు కాళీ చాలా ముఖ్యమైన దేవత. ఈ ఆలయాన్నిబట్టే ఈ ప్రాంతానికి కాళీ ఘాట్ అనే పేరువచ్చింది. కాళీఘాట్‌లో నుంచే కలకత్తా అనే పేరు వ్యాప్తిలోకి వచ్చిందట.

ముఖద్వారం దాటి లోపలికి వెడితే అరుగులమీద చిన్నచిన్న అంగళ్లలో పూలదండలు, పూజాసామగ్రి అమ్ము తున్నారు. పెద్ద సత్రంలాంటిదానిలో ఎవరెవరో కాపరాలు ఉంటున్నారు. దేవాలయానికి ముందువైపున మేకల్ని బలిఇచ్చే ఏర్పాటు ఉంది.

బృంద ఏదో పూజాసామగ్రి తీసుకుంది. క్యూ రెండుమూడు మెలికలు తిరిగి లోపలికి పోతున్నది. కొందరు కళ్లుమూసుకుని ఏమిటో గొణుక్కుంటు న్నారు. కొందరు పెద్దగా గొంతెత్తి అరుస్తున్నారు. ఖంగుఖంగుమని గంటలు మ్రోగుతున్నాయి. పూజార్ల అరుపులు, కేకలు, జనం తోపిడి అంతా రణగొణ ధ్వనిగా ఉంది. గర్భగుడిలోకి నాలుగ యిదు మెట్లుదిగి విగ్రహం వెనకనుంచి, క్యూ ముందువైపుకు వస్తున్నది. దేవీ విగ్రహం చాలా పెద్దదిగా ఉంది.

ఆ భీకర ఆకారాన్ని చాలావరకు పూలదండలు కప్పేశాయి.

బయటికి వచ్చాక బృంద అడిగింది. "మీరు దేవుణ్ణి నమ్ముతారా?"

''మన చుట్టూఉన్న ఇంతమంది మోసగాళ్లనూ, దగాకోరులను నమ్ముతున్నప్పుడు, కనీసం నమ్ముతున్నట్లు నటిస్తున్నప్పుడు, దేవుణ్ణి నమ్ముతున్నట్లు నటించటాని కేం?''

''బావుంది'' అని నవ్వింది జుట్టు పైకి నెట్టుకుంటూ.

అక్కడినుంచి జైన్ టెంపుల్‌కు తీసుకువెళ్ళింది. నూట ఎనిమిది సంవత్సరాల క్రిందట పాలరాతితో కట్టిన ఈ ఆలయంలో ఎంత చల్లదనం! ఎంత తెల్లదనం! అంతటా గంభీరమైన ప్రశాంతత. ఎవరో ఒక భక్తుడు దేవుడి విగ్రహం ముందు కూర్చుని గొంతెత్తి కమనీయంగా పాడుతున్నాడు. మిగిలినవాళ్లంతా పారవశ్యంలో ఊగుతున్నారో, భక్తితో ప్రణమిల్లుతున్నారో తెలియకుండా ఉంది. బయటికి వచ్చాక బృంద అడిగింది.

"చూశారా, మన దేవాలయాలకీ, ఇతరుల దేవాలయాలకీ ఉన్న తేడా!"


"మనకుగూడా బోలెడు దేవాలయాలున్నాయి. అవీ ఎంతో ప్రశాంతంగా ఉంటాయి. కొన్నిటికిమాత్రం స్థలపురాణమనీ, క్షేత్రమహిమ అనీ జనం విపరీతంగా పరుగిడుతారు. అక్కడినుంచీ అనేకమైన వేషాలు, మోసాలు...''

బస్సు ఎక్కాక బృంద అడిగింది ''హైద్రాబాదులో చీఫ్ ఇంజనీర్ ఆఫీసులో మీ కెవరన్నా తెల్సా?"

నవ్వాను. "ఒక్కసారి అక్కడకు ఎగిరిపోయినారేమిటి?"

ఆమె మొహంలో గంభీరమే తప్ప మరోభావం లేదు. "పనుంది, చెప్పండి "

"అక్కడ ఆరడజను చీఫ్ ఇంజనీరు ఆఫీసులున్నయ్. ఎందులో అని?"




"అలాగా?" అని కిటికీలోనుంచి రోడ్డుమీదకు చూస్తూ ఆలోచనల్లోకి జారిపోయింది. తర్వాత సెల్డాస్టేషను దగ్గర దిగి ఇంటికి వెళ్తానన్నది. సాయంత్రం ఈడెన్ గార్డెన్ దగ్గరకు నన్ను రమ్మన్నది. జగదీష్‌చంద్రబోస్ రోడ్డులోకి వచ్చాక ట్రాఫిక్ ఆగిపోయింది.

ఎదురుగా ఏదో ఊరేగింపు. ప్రతివాడి చేతుల్లోనూ కర్రలూ, వాటి కొసన జెండాలు. ముందున్నవాళ్ళు ఎంతో ఉద్రేకంగా అరుస్తున్నారు. వెనుకనున్న వాళ్ళంతా పిడుగులు పడ్డంత బలంగా, బుల్లెట్లు వదిలినంత వేగంగా నినాదాలు చేస్తున్నారు. వాళ్లనడక పరుగులా ఉంది. చేతులు ఊపుతూ, నడిరోడ్డుమీద వీరవిహారంచేస్తూ ముందుకు దూసుకుని వస్తున్నారు.

జనమంతా బస్సులు, ట్రాంలు దిగి ఎక్కడివాళ్ళు అక్కడ చిందరవందరగా పరుగిడుతున్నారు. షాపులవాళ్ళు హడావుడిగా షట్టర్లు దించుతున్నారు. పార్కు స్ట్రీట్‌లో పడి నేను ఇవతలికి వచ్చాను.

హోటల్‌కు వెడితే రెడ్డి చెప్పాడు. ధరల పెరుగుదలకు నిరసనగా ఒక పార్టీ వాళ్ళు రేపు బెంగాల్ బంద్ జరపాలని పిలుపు నిచ్చారుట. ఆ బంద్ జరుపగూడదని మరొకపార్టీవాళ్ళు పిలుపునిచ్చారుట. ఇరుపక్షాలవాళ్లూ ఇవ్వాళ ఊరేగింపులూ సభలూ జరుపుతున్నారుట.

"కాలం మండిపోతోంది సార్. ఇక్కడ కిలో బియ్యం ఎనిమిది రూపాయలు. మాలాంటి బీదాబిక్కీ తిరగబడి లూటీలు చెయ్యక ఏంచేస్తారు సార్?" అని అడిగాడు రెడ్డి. నేను తలెత్తి అతని వైపు చూశాను.

"కలకత్తా జనాభా డెబ్బయిఎనిమిది లక్షలయితే, పదిహేను లక్షలమంది యినా ఫుట్‌పాత్‌లమీద బ్రతుకుతున్నారు సార్. రెక్కలు ఇరుచుకొని పనిచేసినా, ఇక్కడ కడుపు నిండటం లేదండీ."

"అంతటా అలాగే ఉంది రెడ్డీ."

"అదేంటి సార్ అలా అంటారు? పక్కనే గ్రాండ్ హోటల్లోకి పోయి సూడండి సార్. ఆడ ఒట్టి రూంరెంటు రోజుకు నూటడెబ్బయి అయిదు రూపాయలు. టెక్సులో నూటనలభై. అయినా ఖాళీలుఉండవండి. మీకు ఊరుచూపియ్యటానికి గైడ్‌లుంటారండి. లబ్బరు బొమ్మలాంటి అమ్మాయిలు, ఆళ్ల ఏం గావాలంటే అయి సూపిస్తారండీ..." అని పళ్ళన్నీ వెళ్ళబెట్టి నవ్వాడు రెడ్డి.

రూంకొస్తుంటే ఎన్నో ప్రశ్నలు నన్ను వెంటాడినయి. ఈ దేశం చివరికి

ఏమైపోతుంది? రెడ్డి చెప్పింది నిజమేనా? కూటికి లేనివాళ్ళు లక్షలమంది ఉన్నారు గదా. వాళ్లలో లూటీలు చెయ్యలేనివాళ్ళు చాలామంది ఉన్నారుగదా! వాళ్ళందరి సంగతి ఏమిటి? ఏ ప్రభుత్వం వచ్చినా, ఎవరి పరిపాలన మారినా ఈ దేశంలో ఉన్న జనం వీళ్ళేగదా. అడుగడుగునా అడ్డుదోవలకి అలవాటుపడ్డ వీళ్ళు మారనిదే ఈ జనంలోను, సమాజంలోను పరివర్తన రానిదే ఒక ప్రభుత్వాన్ని పడగొట్టి, మరో ప్రభుత్వాన్ని నిలబెట్టి నంత మాత్రాన సగటు మనిషికి వొరిగే దేమీలేదు. రేపు రెడ్డిని కదిలిద్దాం. ఏమంటాడో చూద్దాం.

రేపే నాకు ఇంటర్వ్యూ. మరిఇక్కడ అంతా బంద్ అంటున్నారు. ఆఫీసులూ, దుకాణాలూ మూసెయ్యమంటున్నారు. అంచేత పరిస్థితి ఏమిటో కనుక్కుందా మని షిప్పింగ్ కంపెనీకి వెళ్ళాను.

ఎంక్వయిరీలో ఒక అందమైన ఆవిడ పెదాలనిండా రంగు పులుముకుని కూర్చుంది. వెళ్ళంగానే 'ఏ మి టి?' అన్నట్లు చూసింది. 'నీకు పెళ్ళయిందా బేబీ' అని అడుగుదామనుకున్నాను గాని, 'లేదు, నువ్వు చేసుకుంటావా?' అంటే ఈ చెల్లుబడికాని వాయినాన్ని ఎవరికి దానంచెయ్యాలో తెలీక గొప్ప ఇబ్బం దిలో పడిపోతానేమే అని ఊరుకున్నాను.

నా అనుమానం బయటపెట్టాను. రేపు ఆఫీసు మానేస్తున్నారనీ, ఇంట ర్వ్యూలు ఎల్లుండి జరుగుతాయని, కావా లంటే నోటీసు బోర్డులో చూసుకోమనీ చెప్పింది.

రూంకు వచ్చి పడుకున్నాను. ఈ ఉద్యోగం రావాలి. ఆ తర్వాత ఎప్పుడైనా ఎక్కడైనా అనుకోకుండా లలిత కన పడాలి. నాసామిరంగా... అప్పుడుబృంద గూడా నా పక్కన ఉండాలి...నేను పోజుకొట్టాలి! దానికింక నిద్దరపట్టదు... నా ఆలోచనకి నాకే నవ్వొచ్చింది.

ఇదంతా నిజమైతే బాగానే ఉంటుంది గాని, కాదుగదా మరి.

ఇంతకీ ఈ బృందం సంగతి ఏమిటో? పాపం, ఎందుకిలా ఎండలో నా వెంటబడి తిరుగుతోంది? కొంపదీసి లవ్వాడుతా నంటుందా? సాయంత్రం అడుగుదాం. అంటే సాయంత్రం ఒక ఇంటర్వ్యూ, ఎల్లుండొక ఇంటర్వ్యూ అన్నమాట. దేంట్లో నెగ్గినా, జాతకం మరో మలుపు తిరిగినట్లే.

సాయంత్రం అయిదు గంటలకు తయారై, ఎస్ప్లనేడ్‌లో దిగి ఈడెన్ గార్డెన్‌కి ఎటుపోవాలని అడిగాను. అతను జవాబు చెప్పకుండా నావంక ఎగాదిగా చూశాడు. నేను సరిగా గమనించలేదు గాని షాపులన్నీ మూసేసి ఉన్నాయి. జనం అంతా ఆందోళనగా ఉన్నారు. పోలీసులు యుద్ధానికి సిద్ధమై రోడ్డునిండా పహారా కాస్తున్నారు.

ఈడెన్ గార్డెన్‌వైపు వెళ్ళటం మంచిదికాదని, అటువైపు మీటింగులు జరుగుతున్నయనీ, ఫైరింగ్ అయిందనో అవుతుందనో అనుకుంటున్నారని, డలౌసీ స్క్వేర్‌లో లాటీచార్జీ జరుగుతుం దనీ, జనమంతా ఇటు పరుగెత్తుకుని వస్తున్నారనీ సలహా చెప్పాడా ఆగంతకుడు.

కానీ పాపం బృంద అక్కడికి వస్తానన్నది. నాకోసం అక్కడ ఎదురు చూస్తూంటుందేమో. తొందరగా వెళ్ళి ఆమెను ఇవతలికి లాక్కొస్తే నయంగదా.

మధ్యలో మరో ఇద్దర్ని అడిగి పరి స్థితి కనుక్కుంటూ ముందుకు వెడుతుంటే బృంద ఎదురైంది.

"రా, రా, మంచిచోటే సెలక్ట్ చేశావు" అన్నాను నవ్వుతూ.

"ఇవ్వాళ ఈ మీటింగులు ఇటువైపు జరుగుతాయని నాకుతెలియదు" అన్నది, జేబురుమాలుతో నుదుటిమీద నిల్చిన స్వేదబిందువులను అద్దుకుంటూ.

నెహ్రూ రోడ్డువరకు నడిచాం. ఉద్రిక్తత ఎక్కువవుతున్నది. పోలీసులు లారీలు దిగుతున్నారు. జనాన్ని వీలైనంతవరకు రోడ్ల మీద నుంచి తరిమేస్తున్నారు. అయినా ఫుట్‌పాత్‌లమీద జనం అటూ ఇటూ మసులుతూనే ఉన్నారు. ఎప్పుడు జనం మధ్యలోనుంచి నాటుబాంబు పేలు తుందో తెలియదు. ఎప్పుడు పోలీసుల తుపాకులు పేలుతాయో తెలియదు. జనం అంతా భయంభయంగా ఎక్కడివాళ్ల క్కడ దాక్కుంటున్నారు. షాపులన్నీ ఎప్పుడో మూసేశారు. రిట్జ్ ముందరి కొచ్చాం.

"రా వెళ్దాం" అన్నాను, ఆమెచెయ్యి పట్టుకుని లాగుతూ.

ముందు నా వంక వింతగా చూసింది. తర్వాత నా చేతిలోనుంచి, తన చేతిని విడిపించుకున్నది. తర్వాత "రిట్జ్‌లోకా?" అని విస్తుపోయింది.

"చూశావుగా చుట్టూ పరిస్తితి ఎలా ఉందో? కాసేపు షెల్టర్...కమిన్..."

అయిష్టంగానే నరకంలోకో, మురికికూపంలోకో కాలుపెడుతున్నంత బాధగా, నా వెనకాల రిట్జ్ కాంటినెంటల్ లోకి నడిచింది బృంద.

విశాలమైన హాలు. ఒక మూల చిన్న కౌంటర్. క్రింద అంతటా నేల కనబడ కుండా నారింజరంగులోనున్న మొహ మల్ తివాసీ. నిన్న పొద్దున్నే యజమాని చనిపోయిన ఇల్లులాగా, అంతటా నిశబ్దం. ఒకపక్కగా విశాలమైన మెట్లు. మెట్లమీద గూడా అదే తివాసీ. పైకివెడితే, అక్కడ సోఫాల్లోఎవరో పరాయిదేశస్తులు ఇద్దరు ముగ్గురు కూర్చుని ఉన్నారు.

రెస్టారెంటులోకి వెళ్లాం. సూప్‌లు, వెజిటబుల్ బిర్యానీలు చెప్పాను. తనకి ఐస్‌క్రీం కావాలన్నది. వాడు వెళ్లి పొయ్యాడు.

బృంద నుదటిమీద, పై పెదవిమీద సన్నని స్వేదబిందువులు నిలిచి, తెల్లని

పద్మంమీద కురిసిన సన్నని మంచుబిందు వుల్లా మెరుస్తున్నాయి. మధ్యమధ్య నా వంకచూస్తూ తలదించుకుంటున్న ఆమె కనురెప్పలమధ్య తళతళమంటున్న విశాలమైన ఆమె నేత్రాలు, నీళ్లమీద తేలుతూ, మునుగుతూ ఆడుకుంటున్న చేపపిల్లల్లా ఉన్నాయి. ఆమె కరకమలాల్లో మెనూకార్డు ముందుకీ, వెనక్కీ ఊగుతున్నది. ముందుకు వంగినందువల్ల ఉంగరాలుగా తిరిగిన ఆమె ముంగురులు నుదుటమీదనుంచి ముందుకు వేలాడుతున్నాయి. వాటి నొక్కసారి వెనక్కి సవరించాలని, ఈ అమ్మాయిని చూసినప్పుడల్లా అనిపిస్తోంది. ఎప్పటికో?

"సారీ, బృందా. ఇక్కడికి రావటం నీ కిష్టంలేనట్లుంది."

"ఫర్వాలేదు." మళ్లీ మౌనం మా ఇద్దరిచుట్టూ గిరిగీసింది.

"ఏమన్నా మాట్లాడుదూ......" అన్నాను ఆమె మొహంలోకి చూసి నవ్వుతూ.


హఠాత్తుగా "మీకు హైదరాబాదు అంతా బాగా తెల్సా?" అని అడిగింది.

"ఏమిటి దాన్ని పట్టించావు.... ఒకప్పుడు అదీ బాగానే వుండేది. ఇప్పుడు చెత్తగా తయారైంది. దానికన్నా బెజవాడ నయమనిపిస్తోంది. మీ వైజాగ్ సంగతి నాకు తెలీదు."

"నాకో చిన్న హెల్ప్ చెయ్యాలి మీరు." అన్నది తను కుర్చీలో కూర్చునే నావైపుకి తిరిగి.

"విత్ ప్లెజర్. నీకోసం ఏమైనా చేస్తాను కొండల్ని పిండికొట్టమంటావా? ఈ రిట్జ్ హోటల్ని కొనిపెట్టమంటావా? చెప్పు, ఏంకావాలో?"

ఆమె ప్రసన్నంగా లేదు. ఎందుకో గంభీరముద్రవహించి ఉన్నది. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ నాతో అన్నది. "మీరు హైదరాబాదు వెళ్లాక అక్కడ




ఒకర్ని కలుసుకోవాలి. అతనితో నేను ఇక్కడ ఉన్నానని చెప్పాలి...." ఆమెలోని మనఃక్లేశం ఆమె మొహంమీద గూడా నీడల్ని దింపింది.

"ఐ కుడ్‌నాట్ ఫాలో యు... సరిగ్గా చెప్పు."

"వైజాగ్‌లో ఉండగా నా క్లాస్‌మేట్ ఒకతన్ని ప్రేమించాను. పేరు హరిగోపాల్. మొన్ననే ఇద్దరం ఫైనలియర్ పరీక్షలు రాశాం. పెద్దవాళ్లు కాదన్నారుగాని, మేంమాత్రం పెళ్లి చేసుకోవటానికే నిర్ణయించుకున్నాం. రిజల్ట్స్ వచ్చాక ఏదో ఉద్యోగం చూసుకుని, మేము ఇద్దరం వేరే వెళ్లాలని మా ప్లాన్. మా వాళ్లు ఇదంతా పసిగట్టారో ఏమో, నన్ను బలవంతంగా ఇక్కడ దిగవిడిచి వెళ్లాడు మానాన్న. హరివాళ్ల ఫాదర్ హైద్రబాదులో ఉన్నారు. పరీక్షలు రాసి ఇతనూ అక్కడికి వెళ్లాడు. రిజల్ట్స్ వచ్చాక నాకోసం వస్తాడు. నా సమాచారం అతనికి తెలియకపోతే, మళ్లీ జీవితంలో మేం కలుసుకునే అవకాశం ఉండదు. మా ఆశలూ, కలలూ అన్నీ గాలికి కొట్టుకుపోతయ్."

"ఈలోగా మీరు ఉత్తరాలు రాసుకుంటూ ఉండవచ్చుగా..."

"ఒకరు రాసిన ఉత్తరాలు మరొకరికి చేరుతాయన్న నమ్మకం లేదు. వైజాగ్‌లో ఉండగానే మావాళ్లు పోస్ట్‌మెన్‌ను కొనేశారు. అక్కడినుంచి వెళ్లాక తన అడ్రస్ నాకు రాస్తానన్నాడు. ఇప్పుడు నా అడ్రసు అతనికి తెలియదు. అంచేత నా అడ్రసు మీరే అతనికి అందివ్వాలి... అతను తప్పకుండా ఇక్కడికి వస్తాడు. మిగిలిన విషయాలు మేం మేనేజ్ చేసుకుంటాం. మేం మేరేజ్ చేసుకుంటాం..." బృంద మొహంలో సంతోషం...ఆమె కళ్లల్లో ఆశ...వెలుగుతోంది.

చెప్పినవన్నీ టేబులుమీదికి వచ్చినయి. ఏ ఒక్కటీ రుచించలేదు. తింటూ ఆమె చెప్పింది-

"రైల్లో వస్తున్నప్పుడు మీ చేతిలోని నవల తీసుకున్నాను. దానిమీద మీ పేరూ, ఊరిపేరూ చూశాను. అప్పుడే నాకు ఏనుగునెక్కినంత సంతోషమైంది. అందుకే మర్నాడు నన్ను కలుసుకోమని చెప్పాను. అప్పుడు మీ రేమనుకున్నారో నాకు తెలియదు..."

"........."

"ఈ రెండురోజులనుంచీ మీ కీ విషయం చెప్పాలనే ప్రయత్నించాను, కానీ వీలుపడలేదు. ఇందాక మీరు నా

చెయ్యి పట్టుకున్నప్పుడు, నేను ఎంత ఆలస్యంచేశానో తెలుసుకున్నాను...''

"ఆయామ్ ఎక్స్ట్రీంలీ సారీ... పొరపాటయింది... అదీగాక బయటి వాతావరణం...''

''నేను అర్థం చేసుకోగలను...'' అన్నది.

తినటం పూర్తయ్యాక కాసేపు మౌనంగా కూర్చున్నాం. అంత హాలులోనూ ఇద్దరమే దిక్కులుచూస్తూ బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాం. చాపక్రింద నీరులాగా కాలం నెమ్మదిగా జారిపోతున్నది. విసుగ్గాఉంది. బిల్లు చెల్లించినా బయటకి వెళ్లటానికి వీల్లేకుండా ఉంది. లోపల ఉందామంటే, అనుకున్నదొకటీ, అయింది మరొకటీ అయింది.

ఈ ఆడవాళ్లంతా ఒకటే. ఆకర్షించటం వాళ్ల సొత్తు. నిరాకరించటం వాళ్ల హక్కు. ఇవతలివాడు కాస్త బలహీనుడయితే, వాణ్ణి చావుదెబ్బ కొట్టటమూ వాళ్లకే తగును.... లలిత నన్నెంత ఊరించింది! తరువాతఎంత ఉడికించింది! అప్పట్లో ఆ రెండిటికీ విపరీతంగా చలించిపోయినందువల్లనే, మళ్లీ ఏ స్త్రీ వేపూ నాదృష్టి మళ్లలేదు. ఇప్పుడీ బృందగూడా తనంతట తానే నాకు దగ్గరగా వచ్చింది. హెల్ప్‌కావాలట, హెల్ప్. అదేదో ముందే ఏడవ్వచ్చుగా.

''ఇంతకీ నీ హరిగోపాల్‌ను ఎలా కల్సుకోవాలో చెప్పలేదు."

''నాకూ సరిగ్గాతెలియదు. వాళ్లఫాదర్ ఏదో సి. యి. ఆఫీసులో సూపర్నెంటట. పేరు నరసింహారావుట".

''సరె."

"ఇప్పుడు మా భవిష్యత్తు అంతా మీ చేతుల్లో ఉంది. నీట ముంచినా, పాల ముంచినా మీదే భారం."

"నా శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాను..."

"నా మీద కోపం వచ్చిందా?" అని అడిగింది కళ్లింతచేసుకుని చూస్తూ.

''ఎందుకూ?" నవ్వబోయాను.

"నే నేవిధంగానన్నా మి మ్మ ల్ని నిరాశపరిస్తే క్షమించండి..."

"........."

"మీ రీ సాయం చెయ్యకపోతే, హరి నాకు దక్కడు. హరి నాకు దక్కకపోతే, నే నేమయిపోతానో..'' ఆమె గొంతు సుళ్లు తిరిగింది. కన్నీరు జుర్రున కిందకి జారింది.

''ఇంత చదువుకున్నదానివి, నీ కీ బేలతనం ఏమిటి బృందా?"

"చదువుకీ, అదృష్టానికీ సంబంధం లేదండీ. అందుకని...''

మరికాసేపు దిక్కులు చూస్తూను, ఒకరివంక మరొకరం ఇబ్బందిగా చూసుకుంటూను కాలం గడిపి, బయటికి వచ్చాం.

మర్నాడు అంతా నాకు గదే బందిఖానా అయింది. తరువాత రోజు లేచేటప్పటికి తొమ్మిదై పోయింది. హడావుడిగా అన్నీ పూర్తిచేసుకుని పదిగంటలకు ఆఫీసుకు వెళ్లాను. పాతికమంది దాకా వచ్చారు.

లోపలికి పిల్చాక ఆఫీసర్లలో ఒకడు ''ఆర్ యూ ఫ్రం ఆంధ్రా?" అని అడిగాడు.

"యస్సర్" అన్నాను వినయంగా.

"మీ ప్రత్యేక రాష్ట్రం ఏమైంది?"అని అడిగాడు ఇంకొకడు.

మీ ధరలు తగ్గటం ఏమైందని అడుగుదామని అనుకున్నాను. కానీ అడగటం వాళ్లవంతుగదాని ఊరుకున్నాను.

ఇంకో రెండు చెత్తప్రశ్నలు వేసి బయటకు పంపించాడు. ఒక గంటసేపటికి ఒక బిపిన్‌చంద్రబాబునీ మరో పొట్టిగొను బేబినీ సెలెక్ట్ చేశామని చెప్పారు. మా రాష్ట్రంలోనే మాకు ఉద్యోగాలు ఇవ్వం పొమ్మంటుంటే ఇంతదూరం రావటం అవివేకమే మరి.

కాళ్లీడ్చుకుంటూ హోటలుకు వచ్చేటప్పటికి రెండు గంటలైంది. వడ్డించటానికి వచ్చినవాణ్ణి అడిగాను'రెడ్డిఏడని?' వాడు భయంతోను, దుఃఖంతోను, చలించిపోతూ, "కిల్డ్ సర్, కిల్డ్" అన్నాడు.

"ఏమన్నావ్?"

"మర్డర్డ్ సర్...యస్టర్‌డే ఫైరింగ్... సిక్స్ పీపుల్ కిల్డ్... రెడ్డి ఆల్సో..."

ఇంకా రెడ్డికి నేనేదో చెప్పాలని, నచ్చచెప్పాలని అనుకున్నాను. అతని తొందరే అతన్ని మింగేసింది. అన్యాయంగా ఆహుతి అయిపోయినాడు. ఈ ఆరుగురూ చచ్చి ఏం సాధించినట్లు? ఎప్పుడు ఎక్కడ ఏ ఉద్యమం జరిగినా అమాయకంగా ముందుకు ఉరికేదీ, ముందుగా నేలకు ఒరిగేదీ వీళ్లే. ఈ పేదవాళ్లే. ఈ ఉద్యమాలు ఆరంభించి వాళ్లకే గనుక వాటిపట్ల నిజాయితీ ఉంటే ఈ దేశంలో ఇన్ని సమస్యలు ఇలా అపరిష్కృతంగా ఉండేవికావు. ఇంత జరిగినా ఇంకా వాళ్లే వీళ్లకు నాయకులు. వాళ్ల వెనకాలే వీళ్లు ఉంటారు. అదీ చిత్రం.

నాకు తిండి సయించలేదు. గదికి వచ్చాను. బయట ఎండ మండిపోతోంది. కడుపులోనూ మండిపోతోంది...అసలు ఇక్కడకు రాకుండా ఉండవల్సింది. ఆశ. ఆశాపాశమే ఇంతదూరం లాక్కొచ్చింది. గబగబా నిచ్చెన ఎక్కెయ్యాలని ఆత్రం. పట్టు చిక్కటంలేదు. కాలు జారుతున్నది. మెట్టు అందటం లేదు.

లలిత... ఈ ఉద్యోగం... బృంద ... అన్నీ అందమైనవే. అందుబాటులోకి వచ్చినవే. అయినా ఒక్కటీ అందలేదు. ఇవన్నీ శ్రావణ మేఘాలు. చూస్తుండగానే అవన్నీ కరిగి, నీరై, నేల రాలి మట్టిపాలై పోతాయి. ఒకవేళ

ఆ ప్రయాణమేనేమో వాటి ప్రయోజన మూను. ఈ అవకాశాలూ అలాగే దాపుకి వచ్చినట్లే భ్రమ. అంతలోనే ఏదో అందమైన కల. కళ్లు తెరచి చూస్తే అంతా కల్ల.

సాయంత్రం విక్టోరియా మెమోరియల్ మెట్లదగ్గర నీరెండలో నిలబడి ఎదురు చూస్తున్నది బృంద. దగ్గరగా వెళ్లాను. నీలాకాశం రంగులో నున్న జపాన్ టెరిలిన్ చీర. దానికి సరిపడినదే జాకెట్టు. కొంచెం బొద్దుగా కనబడే బృంద, ఇప్పుడు మరింత ముద్దుగా ఉంది. పల్చగా పౌడరు రాసుకున్న ఆమె వదనం విరిసిన తెల్లకలువ పువ్వులా ఫ్రెష్‌గా ఉంది. పైటకొంగు మీద కుట్టుకున్న జరీపూలు, పెదవుల మీదకు తెచ్చుకున్న చిరునవ్వు కాంతివంతంగా మెరుస్తున్నాయి.

"ఏమి టలా ఉన్నారు?" అని అడిగింది.

"ఎలా ఉన్నాను?"


"ఇంటర్వల్ తర్వాత హీరోలాగా ..." నవ్వింది.

నేనూ శృతి కలిపాను. "ఇంటర్వల్ గాదు, క్లయిమాక్స్‌గూడా దాటిపోయింది. కాని నేనుమాత్రం హీరోనికాదు; హీరో నీ హరిగోపాల్......ఇంతకీ అతనెలా ఉంటాడు బృందా? బావుంటాడా?"

"బావుంది... నా కళ్లకి బావుండబట్టేగదా, నేను మెచ్చింది''.

"మీ రిద్దరూ అదృష్టవంతులు" అన్నాను, ఆమెపక్కనే నడుస్తూ. మెమోరియల్ వెనకవైపునున్న గేటు దగ్గరకు వస్తున్నాం. రోడ్డుప్రక్కనే ఉన్న చిన్న పోకచెట్టుకింద నిలబడిపోయింది. నేనూ ఆగాను. నా కళ్లల్లోకి చూస్తూ తన నీలాల కళ్లనిండా నీళ్లు నింపుకుంది. అన్నది గదా—

"ఏమో, మా అదృష్టమంతా మీరు చేసే సాయంమీద ఆధారపడిఉంది. నేను




ఎప్పుడూ అనుకుంటూ ఉండేదాన్ని. నాకొక అన్నయ్యే గనక ఉంటే నన్ను అర్థంచేసుకుని, నాకు అండగాఉండేవాడు గదాని. ఇప్పుడు నువ్వు నాపక్కన నిలబడితే నా కెంతో ధైర్యంగా ఉందన్నయ్యా. నాకా లోటు తీరినట్లే ఉంది.'' ఆ తర్వాత ఉద్వేగంలో ఆమె గొంతు పూడుకుపోయి, మాట వెలికిరాలేదు. ముత్యాల్లా జలజలమని రాలిన కన్నీటి బిందువులు నలిగిన బాటమీదపడి చిట్లిపోయినయి.

నాకూ చెల్లెళ్లు లేరు. నన్ను అన్నయ్యా అనిపిల్చిన వాళ్లెవరూలేరు. పరాయి ఆడపిల్లలను చూడగానే అందరికీ ఏ భావం కలుగుతుందో మొదట్లో నాకూ ఆ భావమే కలిగింది. ఆ నాడు లలిత నేర్పిన పాఠం మర్చిపోలేదు. అందుకే అందరికీ ఎంతో దూరంగా ఉంటూ వచ్చాను. ఈ బృంద గూడా తనంతటతానే నాకు దగ్గరగా వచ్చింది. నిన్న తనగోడు చెప్పుకున్నాక, ఈమె పరాయిసొత్తు అని తెల్సుకుని, ఆ మర్యాదనూ ఇవ్వదల్చుకున్నాను. ఇప్పుడు నన్ను అన్నయ్యా అన్నది. ఇది మరో అనుభూతి. మరొక అనుబంధం నాకు మాత్రం ఏం అభ్యంతరం ఉంటునది?

ఎండ తగ్గిపోయి చీకటి ముసురుకుంటున్నది. చుట్టూ కనబడుతున్న దృశ్యాలన్నీ దృశ్యాదృశ్యంగా సిల్హౌటీ లోని బొమ్మలా కనబడుతున్నాయి.

బృంద ఈవేళ బిర్లా ప్లానిటోరియం చూపిస్తానన్నది. ఏడున్నరకిగాని ఇంగ్లీషు షో లేదట. బెంగాలీ కామెంటరీ మాకు అర్థంకాదుగనక ఏడున్నరకే వెళ్దామనుకున్నాం. అందాకా ఏం చెయ్యాలో తోచలేదు. రవీంద్ర సదన్‌వైపు వెళ్దాం అంది. నాకు జనంలోకి నడవటం సరదాగాబట్టి చౌరంగీవైపు వెళ్దామన్నాను.

దారిలో ఒక ఫాన్సీ షాపులోకి దూరి, పాతిక రూపాయలుపెట్టి నాకు నచ్చిన హాండ్‌బాగ్ తీసి ఇచ్చాను.

"నా కెందుకు?" అన్నది.

"ఈ అన్నయ్య ప్రజంటేషన్"

"థాంక్స్" అన్నది దానివంక ప్రేమగా చూస్తూ

ఇంకాస్త పైదాకావెళ్ళి వెనక్కివచ్చాం. ఇంకా షో వదల్లేదు. టిక్కెట్లు తీసుకుని బయట నుంచున్నాం.

"ఏమిటి గొణుగుతున్నావు?" అని అడిగింది.

"ఆ టాటా వాళ్ల బిల్డింగ్ ఎన్ని

అంతస్తులో లెక్కపెడుతున్నాను. పది అంతస్తులు దాటేటప్పటికి ప్రతిసారీ లెక్కతప్పుతోంది" అన్నాను. నవ్వింది. తనూ లెక్కపెట్టి, ఓడిపోయి, ఊరుకుంది.

ఎదురుగా రోడ్డుకు అవతల పచ్చిక బయలులో చెట్లనీడల్లో, ఏవో కదులుతున్న నీడల జంటలు. షో వదిలారు. మేం లోపలికి వెళ్ళాం.

ఈ భూమిమీద ఆకాశం బోర్లించిన గిన్నెలా ఉన్నట్లే, ప్లానిటోరియం పై కప్పుగుడా బోర్లించిన అర్ధగోళాకారంలో ఉంది. ఆకాశంలో జరిగే అనేక వింతలు అక్కడ కూర్చున్న నలభై అయిదు నిముషాల్లోను మాకు చూపించారు. సూర్యోదయం, పరిభ్రమణం, అస్తమయం, చంద్రోదయం, అస్తమయం, తారామండలం, వాటి కదికలు – ఇలా అనేక వింతల్ని చూపిస్తూ, వ్యాఖ్యానం చెప్పారు. గొప్ప సైంటిఫిక్ స్కిల్ ఉన్నదనే తప్ప నాలాంటివాడికేం తెలుస్తుంది? బృందమాత్రం శ్రద్ధగా చూస్తూన్నది. నేను మధ్యలో కాసేపు కునుకుతీసి లేచాను.

ట్రాం కోసం ఎదురుచూస్తూ నించున్నప్పుడు బృందతో అన్నాను. "రేపు వెళ్లిపోతున్నాను."

"అప్పుడేనా? నీ ఇంటర్వ్యూ ఏమైంది?"

''నా కిక్కడ ఉద్యోగ్యం చెయ్యాలని లేదు. అయామ్ వెక్స్‌డ్."

"ప్లేటు మార్చావేమిటి ?'' అని నవ్వింది. రోడ్డుమీద పరుగిడుతున్న వాహనాల వెలుతురులో మల్లెమొగ్గల్లాంటి పలువరుసతోబాటు, గాలికి ఊగుతున్న ఆమె చెవుల ఆభరణాలుకూడా తళుక్కుమని మెరిసినయి.

''ఇంతకన్న నరకం మరొకటి లేదు"

''అందని ద్రాక్షపళ్లు పులుపేలే".

ఇద్దరం నవ్వుకున్నాం. ఇంతలో ట్రాం వచ్చింది. రేపు కలుస్తానని చెప్పి వెళ్ళిపోయింది. మర్నాడు నాకు వీడ్కోలు చెప్పటానికి స్టేషన్‌కు వచ్చి నా డైరీలో తన అడ్రసు రాసిఇచ్చింది.

"ఏం చేస్తావో మరి" అన్నది దిగాలుగా.

''నాకో బంధాన్నిగూడా వేశావుగా. నీ ప్రియుణ్ణి తప్పకుండా నీ వద్దకు పంపిస్తాను".

"నీకు చాలా శ్రమ ఇస్తున్నాను."

''ఒక కుటుంబాన్ని నిలబెట్టటానికి ఈమాత్రం చెయ్యటం ఒకపెద్ద కష్టం కాదు."

ఆమె తలొంచుకుని నెమ్మదిగా స్వగతం చెప్పుకునట్లు అన్నది. ''హరి లేకపోతే నేబ్రతుకలేను అన్నయ్యా..."

ఈమె ఇంత నమ్మకంగా, అమాయకంగా అతనికోసం ఎదురుచూస్తూన్నదే గానీ అతను ఎలాంటివాడో, ఏంచేయదల్చుకున్నాడో తెలియదు. ఆ మాటే అంటే బృంద చాలషార్ప్‌గా రియాక్ట్ అయింది.

"హరి అలాంటివాడు కాదు. నా అంచనా ఎప్పుడూ తప్పుకాదు. ఒక్కసారి అతనితో మాట్లాడితే నీకే తెలుస్తుంది."

''మాట్లాడుతాను... గుడ్‌లక్"

''థాంక్యూ'' కళ్ళుతుడుచుకుంది.

రైలుకదిలింది.

గాలిలోకి చెయ్యి ఊపుతూ ప్లాట్‌ఫాం మీద నిలబడిపోయిన బృందే, నా హృదయంలో నిలబడిపోయింది.

హైదరాబాదు వచ్చాక రెండురోజులు పడకవేశాను. జ్వరం తగ్గి ఆఫీసుకువెళ్ళేటప్పటికి నా కోసం ఫోను వచ్చింది. గుంటూరునుంచి ప్రసాద్ వచ్చాడు. నన్ను వాళ్ల ఆఫీసుకు రమ్మని కబురు. తప్పించుకుందామన్నా వాడు వదిలేఘటంకాదు.

సెంట్రల్ ఎక్సయిజ్‌లో పనిచేస్తున్నాడు వాడు. వాళ్ల కలెక్టరుగారి కూతురి పెళ్ళిట. నాలుగురోజులు తిష్ట వేశాడు. వాడొస్తే నా కేపనీసాగదు. సుడిగాలిలా నన్ను చుట్టేస్తాడు. వాడికి ఇనస్పెక్టరుగా ప్రమోషను వచ్చిందట. ఒకరోజు పార్టీ అన్నాడు. ఒకనాడు షాపింగ్ అన్నాడు. మర్నాడు పెళ్ళి అన్నాడు. ఉన్న నాలుగురోజులూ నన్ను వదల్లేదు. తర్వాత రెండురోజులు శలవులు వచ్చాయి.

ఆ మర్నాటికల్లా బృందదగ్గరినుంచి ఉత్తరం రానేవచ్చింది.

'అవుటాఫ్ సైట్' కాగానే 'అవుటాఫ్ మైండ్' కాలేదనుకుంటాను. నీ మీద కొండంత ఆశ పెట్టుకున్నాను. రోజులు గడిచేకొద్దీ, ఎండకు కరిగే మంచుపొరలా, ఆశ కరిగి నీరైపోతోంది. నా బాధ ఏమిటో నీకు ఇదివరకే చెప్పుకున్నాను. ఆపైన నీ దయ–బృంద.


ఆ ఉత్తరం వచ్చాక మళ్ళీ కొంచెం చలనం ప్రారంభమయింది. పి.డబ్ల్యూడిలో ఉన్న నలుగురి స్నేహితులకి చెబితే, సాయంత్రానికి అడ్రసు కనుక్కొని చెప్పారు. మర్నాడు ఆ ఇల్లు వెతుక్కుంటూ సైదాబాదు వెళ్ళాను. గేటు తెరుచుకుని లోపలికి వచ్చాక గ్రిల్ రూందగ్గర నిలబడి మొక్కలకు నీళ్లు పడుతున్న ఆమెను పోల్చుకోవటం కష్టం కాలేదు. లలిత...'యూ'...

"ఇక్కడికెందుకొచ్చావు ?" అని అడిగింది. ఎంత పొగరు !

దగ్గరున్న బండ ఎత్తి దాని నెత్తిమీద కొట్టి పారిపోవాలన్నంత కోపం వచ్చింది. కాని బృంద కన్నీరు గుర్తుకొచ్చి, అంత కోపాన్ని మింగుకున్నాను :

"హరిగోపాల్ కావాలి."

నా వైపు అనుమానంగా చూస్తూ లోపల ఉన్నాడు "వెళ్లండి." అక్కడ నేను విన్నదీ, చూసిందీ హృదయ విదా




రకమైన విషయం. పది నిముషాలకన్నా ఎక్కువసేపు అక్కడ ఉండలేకపోయి నాను.

బృందకు ఉత్తరం రాయటమా, మానటమా అని రెండురోజులు తటపటాయించాను. ఒకరోజు తెల్లవారు ఝామున ఏదో పీడకల వచ్చింది. హౌరా బ్రిడ్జిమీదనుంచి బృంద నదిలోకి దూకిందిట. ఉలిక్కిపడి లేచాను. తెల తెలవారుతున్నది. పక్షులు కిలకిలమంటు న్నాయి. చల్లగాలి హాయిగా వీస్తోంది. ఎన్నడూ లేనిది ఈ కలఏమిటి? ఈ వేళ ప్పుడు ఇలా మెలకువ రావటమేమిటి ?

ఏ కబురూ తెలియకపోతే, బృంద నన్ను అపార్థం చేసుకుంటుందని అప్పుడు తెలిసివచ్చింది. ఆవేళే ఆమెకు ఉత్తరం రాశాను.

"అమ్మలూ—నీ ఉత్తరం అందింది. నీకు జవాబు రాయగూడదనే అనుకున్నాను. కానీ ఇవాళ మళ్ళీ నా మనసు మారింది. నీ విషయాన్ని అలా ఉంచి, నా గొడవ కొంచెం విను.

లలిత అని మా ఊళ్ళో మా యింటి దగ్గర ఒక అమ్మాయి ఉండేది. ఆ పిల్ల ఎక్కడున్నా దీపంలా వెలుగుతుండేది. చిన్నప్పుడు నా చెయ్యి పట్టుకుని, నన్ను విడవకుండా తిరిగేది. నేను కొనిపెడితే తినేది. తిడితే పడేది. కోపమొచ్చికొడితే నోరుమూసుకు పడిఉండేది.

కాలం పరుగెత్తింది. ఆ పిల్ల పెద్దదయింది. నేనునీరుపోసి పెంచుకున్న ఆశలూ మొగ్గలు తొడిగినయి. అయితే మా పరిస్థితి కొద్దిగా చితికిపోయింది. దానికి కళ్ళు నెత్తిమీదికి పోయినయి. చిన్ననాటి చనువుకొద్దీ అడిగితే, నీ మొహం, నీకూ–నాకూ పెళ్ళేమిటి అంది. మళ్ళీ జన్మలో దాని మొహం చూడగూడదనుకున్నాను. నిన్న హరిగోపాల్‌కోసం వెదుకుతూ లలితను చూశాను. నన్ను కాదన్నందుకు మా బాగా అయింది. ఈ మధ్యనే దానికి పెళ్లయింది. అయితే ఏం ! పెళ్ళయిన నాలుగురోజులకే వాడికి స్ఫోటకంపోసి వికృతంగా తయారైనాడు. కళ్ళుగూడా పోయినయి. పోవా మరి ?

ఇంతకీ అత నెవరో కాదు. నీ హరిగోపాలే. నాతో మాట్లాడిన పది నిముషాలూ ఆడదానిలాఏడుస్తూనే ఉన్నాడు. నీ గురించి చెప్పాను. బృంద అదృష్టవంతురాలు కాబట్టే ఈ పెళ్లి తప్పిపోయిందన్నాడు.

భగవంతుడు ఆడుకుంటున్న ఈ చదరంగంలో ఎప్పుడే పావును ఎందుకు కదుపుతున్నాడో ఆయనకే తెలియాలి. నువ్వు చదువుకున్నదానివి. ఈ చిన్న విషయానికి మనసు వికలం చేసుకోకు. నేను చూడు, అన్నీ దులిపేసుకుని ఎలా హాయిగా తిరుగుతున్నానో ? కాలం ఎల్లవేళలా ఒక్కరీతిగానే ఉండదు. రేపు మంచి జరుగుతుందన్న నమ్మకమే మనల్ని బలంగా ముందుకు లాక్కుపోతుండాలి. అంతేగాని వెనక్కి తిరిగి చూస్తూ, కూలబడిపోయి ఏడిస్తే లాభం లేదు. కనుక లెటజ్ గో...గో...అండ్ గో ఆన్ టిల్ ది ఎండ్ కంస్ టు అజ్ ఫైనల్లీ.

ఉత్తరం రాస్తావుకదూ, అమ్మలూ!

"మూర్తి—"

బృంద దగ్గరనుంచి జవాబు వస్తుందేమోనని చాలారోజులు ఆశగా రోజూ పోస్టువాడివైపు చూశాను. కానీ రాలేదు. ఇప్పటికీ నాకు అనిపిస్తూనేఉంది. ఎప్పటికైనా ఏ రైల్లోనో, ఏ ఊళ్లోనో అకస్మాత్తుగా తన భర్తతోనో, పిల్లలతోనో ప్రత్యక్షమవుతుందని, అలా అని నాకు పదే పదే ఎవరో చెబుతున్నట్లే ఉంది. అందుకని, ఎక్కడ ఆడవాళ్లు కనబడ్డా, వాళ్లల్లో బృంద పోలికలకోసం వెతుకుతూనే ఉన్నాను.

